బోనమెత్తిన కోట

- ఘనంగా జగదాంబిక అమ్మవారికి నాలుగో బోనం పూజ
- కిటకిటలాడిన గోల్కొండ కోట
- ఆకట్టుకున్న శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు



కోట చౌరస్తా వద్ద పోతరాజులు, శివసత్తుల పూనకాలు

గోల్కొండ: గోల్కొండ కోట బోనమెత్తింది. గోల్కొండలోని జగదాంబిక అమ్మవారికి నాలుగో పూజ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తమ కుటుంబాలతో అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. తొట్టెల, బోనం కుండలను తెలంగాణ వైభవం ఉట్టిపడేలా అలంకరించారు. తలపై బోనం కుండలతో శివసత్తుల పూనకాలు భక్తులను పరవశులను చేశాయి. పోతరాజులు బూడిద గుమ్మడి కాయలతో గాలిలో విన్యాసాలు చేస్తూ ఆకట్టుకున్నారు. సాంప్రదాయాల వాయిద్యాలతో అమ్మవారి భక్తిగీతాలను పాడుతూ యువకులు కోటపైకి తరలివెళ్లారు. మహిళలు ముందుగా కోటలోని నగీనాబాగ్‌లో గల నాగదేవత పుట్టకు మొక్కి కోండపైకి అమ్మవారి దర్శనానికి తరలి వెళ్లారు. డప్పు వాయిద్యాలపై పలువురు చిన్నారులు ఆకట్టుకునే నృత్యాలు చేశారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు పర్యవేక్షణలో మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉజ్జయిని అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

దశాబ్దాలుగా గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి తరఫున సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పిస్తూ వస్తున్నామని జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి అన్నారు. గురువారం ఆయన వృత్తిపని సంఘం వారితో కలిసి ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వృత్తిపని వారు శివశంకర్, పటేల్, భార్గవ్, నవీన్, విజయ్, శ్రీకాంత్‌చారి, మల్లేష్, సురేష్‌చారి, శివరాజ్, ప్రసాద్, వినోద్ తదితరులున్నారు.



మహంకాళి అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న పూజారి సురేష్‌చారి

గౌలిపురా ఆలయం ఆధ్వర్యంలో..

గౌలిపురా: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోట మైసమ్మ ఆలయ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర ఆధ్వర్యంలో గురువారం గోల్కొండ జగదాంబ అమ్మవారికి పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు. ఆలయం నుంచి పోతరాజుల నృత్యాలు, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పట్టు వస్త్రాలు, ఒడిబియ్యాన్ని సమర్పించారు. ఆలయ కమిటీ ముఖ్య సలహాదారులు కె.మల్లేషంగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎ.మధుసూదన్ గిరి, ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ప్రకాశ్ పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న సాయిబాబాచారి, వృత్తిపని వారు



జగదాంబ అమ్మవారికి పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం తీసుకెళ్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి



కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ భీశ్వ సురేఖ

అబిడ్స్: జీహెచ్ఎంసీ పరిధిలో అభివృద్ధి పనులు, రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల పనులు సకాలంలో చేపట్టడం లేదని గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ డాక్టర్ భీశ్వ సురేఖ పేర్కొన్నారు. గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ..వందలాది కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయాల పెండింగ్‌లు ఉన్నాయన్నారు. పెండింగ్ డబ్బులు ఇవ్వనిదే పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ఏ పనులు కావడం లేదన్నారు. కమిషనర్ వెంటనే కాంట్రాక్టర్ల పాత బకాయిలు చెల్లించి జీహెచ్ఎంసీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు. వేగవంతంగా అభివృద్ధి పనులు జరిగేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ దళిత మోర్చా ఉపాధ్యక్షుడు భీశ్వ ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సకల కళా సమ్మేళనం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సకల కళా సమ్మేళనమని పలువురు వక్తలు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో సిరాజ్ డ్యాన్స్ అండ్ ఆర్ట్స్ ఆకాడమీ ఆధ్వర్యంలో సకలకళా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ మాట్లాడుతూ..కళాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. అంతకు ముందు 200 మంది కళాకారులు వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలువురు నాట్య గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సినీ నటి రాగిణి, ఫ్యూచర్ టీచర్ అకాడమీ వ్యవస్థాపకులు రేవతిప్రసాద్, నాట్య గురువు జి.నర్సింగ్‌రావు, సంస్థ వ్యవస్థాపకులు సిరాజ్ మాస్టార్ పాల్గొన్నారు.



నాట్య గురువులను సన్మానిస్తున్న సినీ నటి రాగిణి

స్టార్టప్‌ల ప్రాముఖ్యతపై జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి

నాంపల్లి: ఇందిరాప్రియదర్శిని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 'స్టార్టప్ ఏకోసిస్టమ్ ఎ యాక్సిలరేటర్ ఆఫ్ ఇండియాస్ గ్రోత్'అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా డీఎస్ఆర్ రాజేందర్ సింగ్ ముఖ్యఅతిథి/ గా హాజరై ప్రసంగించారు. స్టార్టప్‌ల ప్రాముఖ్యత, దేశ ఆర్థిక వ్యవస్థను ఎలా తీర్చిదిద్దబోతున్నారన్న అంశంపై అవగాహన కల్పించారు. ఉస్మానియావర్సిటీ కామర్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ గంగాధర్ మాట్లాడుతూ..నేటి ఆర్థిక పరిస్థితుల్లో స్టార్టప్‌ల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియావర్సిటీ వాణిజ్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నజియా సుల్తానా కీలకోపన్యాసం చేశారు.

దోమల నివారణపై చర్యలు

యాకుత్‌పురా: సీజనల్ వ్యాధులు, దోమల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ మలేరియా విభాగాం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాసులు తెలిపారు. సీజనల్ వ్యాధులు, దోమల నివారణపై అవగాహన కార్యక్రమాలపై గురువారం తన కార్యాలయంలో సర్కిళ్ల ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..వాతావరణంలో నెలకొన్న మార్పుల నేపథ్యంలో జోన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రతిరోజూ దోమల నివారణ చర్యలకు బస్తీలు, కాలనీవాసులు, పాఠశాలల విద్యార్థులకు సూచనాలు చేస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధులపై తము నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రజా ప్రతినిధులు, బస్తీ, కాలనీ, సంక్షేమ సంఘులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పూర్తి సహకారం అందించాలన్నారు.



ఏఈలతో సమావేశం నిర్వహిస్తున్న సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాసులు

ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు నిర్వహించాలి



సంబు వెంకటరమణ

అబిడ్స్: ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఎన్నికలు వెంటనే నిర్వహించాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు సంబు వెంకటరమణ పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఆర్యవైశ్య సంఘానికి సకాలంలో ఎన్నికలు జరపకపోవడంతో నిజమైన వారికి న్యాయం జరగడం లేదన్నారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో పబ్బం గడుపుకున్న బడా ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆర్యవైశ్యులకు ఎలాంటి ప్రయోజనం చేయలేదన్నారు. తమ పాలమూరు జిల్లా నాయకుడు రామకృష్ణ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయించారని గుర్తుచేశారు. ఇప్పటికైనా వెంటనే ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు నిర్వహించి ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన

చార్మినార్: హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయ పునర్‌నిర్మాణం అనంతరం జరుగుతున్న సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవ బోనాల జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన సామూహిక కుంకుమార్చనలో స్థానిక మహిళా భక్తులే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజల సందర్భంగా భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఉత్సవాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.



బోనాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేయాలి



గోషామహల్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, గోపాల్‌జీ

అబిడ్స్: బోనాల వేడుకలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో వేడుకలు సమీపిస్తున్నందున జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్, ఇతర శాఖల అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. గురువారం గోషామహల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ..నియోజకవర్గంలో ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. ధూల్‌పేట్‌లోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ డి.గోపాల్‌జీ, బీజేపీ నాయకులు ముక్కా కృష్ణగుప్తా, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని ఆశా టాకీస్ సమీపంలో ఉన్న ప్రధాన రోడ్డు తవ్వేసి వదిలేయడంతో స్థానిక ప్రాంతాల ప్రజలు, వాహనదారులు, వ్యాపారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ దారి బహదూర్‌పురా, ఫతేదర్వాజా ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారని..ఈ గుంతలమయమైన రోడ్లతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నారు.



రోడ్డును తవ్వేసి వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఉజ్జయినీ మహంకాళికి బంగారు బోనం



బంగారు బోనంకు స్వాగతం పలుకుతున్న ఇన్‌స్పెక్టర్ పరుశురాం

చార్మినార్: భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో భక్తులు గురువారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయంలోని అమ్మవారికి బంగారు పాత్రలోని నైవేద్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బాజాభజంత్రీల నడుమ పోతురాజుల నృత్య విన్యాసాలతో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించారు. సికింద్రాబాద్ దేవాలయం వద్ద నార్త్ జోన్ డీసీపీ లక్ష్మీ పరిమళ కొబ్బరికాయ కొట్టి బంగారు బోనం ఊరేగింపునకు స్వాగతం పలికారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



బంగారు బోనంతో జోగిని నిషా క్రాంతి

ప్రత్యేక పూజలు



శాలిబండ: ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ చార్మినార్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే తిరుపతి శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులతో సందర్శించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

దివ్యాంగులకు పండ్ల పంపిణీ



సాక్షి, సిటీబ్యూరో: జమాఅతె ఇస్లామీ హింద్ ఉమెన్స్ వింగ్ నాయకురాలు నసీమ్ సుల్తానా వృద్ధులు, అనాథలు, దివ్యాంగ పిల్లలకు పండ్లను పంపిణీ చేశారు. గురువారం ఆమె టోలీచౌకీలోని అనురాగ్ హ్యూమన్ సర్వీస్ ఓల్డేజ్ హోమ్‌ను సందర్శించి మేమున్నామనే ధైర్యాన్ని ఇచ్చారు. కుటుంబాల్లో వృద్ధుల ఆరోగ్యానికి ఆదరణ కరువవుతోందని ఆమె ఆదోళన వ్యక్తం చేశారు. అనాథ, దివ్యాంగ పిల్లలకు ప్రేమను పంచే వారిని అల్లాహ్ కరుణిస్తాడన్నారు.

నియామకం



వెంకటేష్

చార్మినార్: బీజేపీ ఓబీసీ మోర్చా రంగారెడ్డి అర్బన్ జిల్లా ఇన్‌చార్జిగా ప్యారసాని వెంకటేష్ నియమితులయ్యారు. ఇప్పటికే ఆయన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్‌గా కొనసాగుతున్న ఆయనకు పార్టీ అధిష్టానం అదనపు బాధ్యతలు అప్పగించింది. తనపై ఎంతో నమ్మకంతో రంగారెడ్డి అర్బన్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించినందుకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి దివాకర్, గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండు యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పెళ్లి చేసుకుంటానంటూ యువతిని వేధిస్తున్న వ్యక్తికి జైలు

నాంపల్లి: పెళ్లి చేసుకుంటానంటూ ఓ యువతి వెంటపడి వేధిస్తున్న ఓ వ్యక్తికి పదకొండవ స్పెషల్ ఎంఎం కోర్టు ఆరు రోజుల జైలు శిక్షను విధించింది. నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పల నాయుడు తెలిపిన వివరాల ప్రకారం..నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఉండే ఆండాలమ్మ బస్తీలో నివాసం ఉండే కేసీ శర్మ(27) అదే బస్తీలో ఉండే ఓ యువతిని పెళ్లి చేసుకుంటానంటూ వెంటపడుతున్నారు. దీంతో బాధితురాలు తల్లిదండ్రులతో కలిసి నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి కేసీ శర్మను అరెస్టు చేసి న్యాయ స్థానం ఎదుట హాజరుపరిచారు. నాంపల్లి మనోరంజన్ కాంప్లెక్స్‌లో ఉండే పదకొండవ స్పెషల్ ఎంఎం కోర్టు అతడికి ఆరు రోజుల జైలు శిక్షను విధిస్తూ తీర్పును ఇచ్చింది.

బోనాలకు ఎల్‌ఈడీ విద్యుత్ లైట్ల వెలుగులు



రామారావు

చార్మినార్: బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని అన్ని ఆలయాల వద్ద తాత్కాలిక విద్యుత్ దీపాలను (ఫోకస్ లైట్లు) ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ విద్యుత్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ రామారావు అన్నారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. జులై 21న పాతబస్తీలో జరిగే అమ్మవారి ఘట స్థాపన ఊరేగింపుతో పాటు ఈనెల 28న పాతబస్తీలో జరిగే బోనాల పండుగ, 29న జరిగే సామూహిక ఘటాల ఊరేగింపునకు తగిన విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఎల్‌ఈడీ వీధి దీపాల ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు. బోనాలను పురస్కరించుకొని ఉత్సవాల నిర్వాహకుల అభ్యర్థన మేరకు అన్ని ఆలయాల వద్ద తాత్కాలిక ఫోకస్ లైట్లను ఏర్పాటు చేయనున్నామన్నారు.

ఉన్నతాధికారులు బోనాల పనులు పర్యవేక్షించాలి



వేడుకల్లో ఎస్ఆర్. లక్ష్మణ్‌రావు తదితరులు

అఫ్జల్‌గంజ్: బోనాల సందర్భంగా అన్ని శాఖల ఉన్నతాధికారులు పర్యటించి పనులను పర్యవేక్షించాలని బజరంగ్‌సేనా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. గౌలిగూడ విఠోభ ఆలయ రథోత్సవ వేడుకల్లో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. అనంతరం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ..గోషామహల్‌తో పాటు పాతబస్తీలో కొన్ని ప్రాంతాల్లోని ఆలయాల్లో బోనాల వేడుకలు ప్రారంభమవుతున్నప్పటికీ ఇంకా అధికారులు పనులు ప్రారంభించడం లేదన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, వాటర్‌బోర్డు ఎండీ, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాతబస్తీలో పర్యటిస్తే కిందిస్థాయి అధికారుల పనితీరు బహిర్గతమవుతుందన్నారు.

ఈటల రాజేందర్‌కు ఆహ్వానం

గౌలిపురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా పటేల్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రతినిధులు గురువారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిశారు. ఈ మేరకు పాతబస్తీలో నిర్వహించే బోనాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జమ్మిచెట్టు రాజు, ఆలయ కమిటీ చైర్మన్ సాకెల్లి సర్వేశ్, అధ్యక్షుడు కాలే శ్రీనివాస్, బస్తీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్, ఆలయ ఉపాధ్యక్షుడు జి.కృష్ణ, కోశాధికారి డి.మనీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.నవీన్ కుమార్, కమిటీ సభ్యులు జి.నరేశ్ ఉన్నారు.



ఈటల రాజేందర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

గోల్కొండ: విద్యార్థులు భావి జీవితంలో అవసరమైన నాయకత్వ లక్షణాలను పాఠశాలల్లోనే అలవర్చుకోవాలని మిలట్రీ అధికారి హెచ్.ఎస్.గ్రేవాల్ అన్నారు. గురువారం ఆయన మురాద్‌నగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాలలో నూతనంగా ఎన్నికైన స్టూడెంట్ క్యాబినెట్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన కొత్త క్యాబినెట్‌కు బ్యాడ్జీలు అందజేశారు. ఈ కార్యక్రమమంలో రవీంద్రభారతి పాఠశాలల జోన్ డీన్ ప్రియమనీష్, డీన్ మధు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌స్పెక్టర్ సురేందర్, ఉపాధ్యాయులు



స్టూడెంట్స్ టీమ్ లీడర్స్‌తో హెచ్.ఎస్.గ్రేవాల్ తదితరులు

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలుండాలి..

చార్మినార్: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ఉండాలని హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్ సురేందర్ అన్నారు. గురువారం చార్మినార్‌లోని నారాయణ స్కూల్‌లో విద్యార్థుల్లో నాయకత్వంపై జరిగిన నాయకత్వ ప్రమాణ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులుగా ఎంపికైన పలువురు విద్యార్థులను అభినందించారు. జీఎం గోపాల్, ఏజీఎం బాల పరమేశ్వర్, ఎస్ఐ సుధీర్ రెడ్డి, కో ఆర్డినేటర్స్ ఆజాద్, భవానీ, నూర్, యేగేందర్, ప్రిన్సిపాల్స్ శారద, తహనీయల్ పాల్గొన్నారు.

పరీక్షలు లేకుండా రెగ్యులరైజ్ చేయాలి



మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన ఏఎన్ఎంలు

గౌలిపురా: 17 ఏళ్లుగా రెండో ఏఎన్ఎంలుగా పని చేస్తున్న తమకు ఎలాంటి పరీక్షలు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ గురువారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో మరో కమిటీని కలిసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఏఎన్ఎంలు మధురిమ, పర్వీన్, సత్యరాణి, శ్రీవాణి, పార్వతీ, జ్యోతి, అరుణ పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి ఆహ్వానం



యాకుత్‌పురా: హరిబౌలీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం వద్ద 29న నిర్వహించే ఘటాల ఊరేగింపునకు హాజరుకావాలని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిని ఆలయ కమిటీ సలహాదారులు రాజారత్నం, కార్యదర్శి దత్తత్రేయలు కోరారు. ఈ మేరకు గురువారం సీపీని ఆయన కార్యా లయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

నేడు సమాలోచన సభ

చార్మినార్: సాంఘిక న్యాయం, రాజ్య సమానత్వం, రాజ్యాంగం అనే అంశాలపై శుక్రవారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో సమాలోచన సభ నిర్వహిస్తున్నామని ఎస్సీ, ఎస్టీ ఐక్య సంఘటన ప్రతినిధి సుదర్శన్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు టి.రాధా, విద్యాసాగర్ అంగళకుర్తి, చొల్లేటి ప్రభాకర్ పాల్గొంటున్నారన్నారు.

వన మహోత్సవం



లక్డీకాపూల్: కాలుష్య రహిత సమాజాన్ని అందరికీ అందించాలని విద్యావేత్తలు జి.ఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం గుడిమల్కాపూర్ కాలనీలోని నారాయణ ఈ టెక్నో పాఠశాలలో వన మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు వన పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ క్రమంలో గుడిమల్కాపూర్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటడంతో పాటు వన రక్షణ – ప్రాణ రక్షణ నినాదంతో విద్యార్థులు ప్లకార్డులు చేపట్టి ర్యాలీ నిర్వహించారు. టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ ఫరహాన ముజీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరిగెమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా నాగేశ్వర్‌రావు



దబీర్‌పురా: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని కోమటివాడిలోని మరిగెమ్మ ఆలయ నూతన కమిటీ గురువారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎ.నాగేశ్వర్ రావు, అధ్యక్షుడిగా సి.కృష్ణ, ఉపాధ్యక్షులుగా జి.శ్రీధర్‌గుప్తా, డి.సుభాష్, జగన్ మోహన్ రెడ్డి, ఎం.అనీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీకాంత్ గౌడ్, కార్యదర్శులుగా ఎం.విజయ్ కుమార్, ఎ.నితేష్ కుమార్, సి.హేమంత్ కుమార్, కోశాధికారిగా సి.అశోక్‌తో పాటు కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు.